


# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

AUGUST - 2008

సంవత్సర చందా రూ. 50/-

# ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్

## Asian Bible Lectireship at Kakinada

తేదీలు : 2008 నవంబరు 30వ తేదీ నుండి
డిశంబరు 4వ తేదీ వరకు

సమయం : ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు
మధ్యాహ్నం 3:00 గంటలకు
సాయంత్రం 6:00 గంటలకు

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్
కాకినాడ

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు, బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

Cell : 92474 56270
0884 2363722

వందనములతో
రిక్కీ గూటంగారు
జాషువా గూటంగారు

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | ఆగస్టు 2008 | సంచిక-1


## యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 5

*(Jesus Christ, the son of God-5)*

యేసుక్రీస్తు జన్మించిన విధానమును బట్టి, చేసిన అద్భుతక్రియలు, బోధలను బట్టి, ఆయన దేవుని కుమారుడని గత సంచికలలో తెలిసికొనియున్నాము. యేసుక్రీస్తు కూడ "దేవుడు తన సొంతతండ్రి అని చెప్పి తన్నుతాను దేవునితో సమానునిగా చేసికొనెను. అందు నిమిత్తము యూదులు ఆయనను చంపవలెనని మరిఎక్కువగా ప్రయత్నము చేసిరి" (యోహాను 5:18). చివరిగా వారు యేసును పట్టుకొని రోమా గవర్నరయిన పిలాతు నొద్దకు యేసును తీసికొనివచ్చి ఆయనను సిలువ వేయుము, సిలువ వేయుము అని కేకలు వేసిరి. ఆయన యందు నాకు ఏ దోషమును కనబడలేదు అని పిలాతు అనగా, అందుకు యూదులు మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో చెప్పిరి (యోహాను 19:6-7). యూదులు ద్వేషము వలన యేసును సిలువవేసి చంపిరిగాని, యేసు నమాది చేయబడిన మూడవ దినమున సమాధిని జయించి సజీవుడై తిరిగి

లేచుట ద్వారా దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెను.

యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని మనము నమ్మునట్లు యేసును గూర్చి వందలాది సంవత్సరములకు ముందు నుండే దేవుడు తన ప్రవక్తల ద్వారా ప్రవచించెను. బైబిలు నందు యేసుయొక్క జననము, జీవనము, మరణము, పునరుత్థానములను గూర్చిన ప్రవచనము లనేకములున్నవి. వానిలో కొన్ని అవి నెరవేరుసరికి 1500 లేక 1000 సం॥ల కంటె ముందు చెప్పబడినవి. పాతనిబంధనలోని ఆఖరి పుస్తకమయిన మలాకీ గ్రంధము క్రీస్తుకు పూర్వము 450 సం॥లకు ముందే ముగించబడినందున క్రీస్తును గూర్చి చెప్పబడిన ప్రవచనములు అవి నెరవేరుసరికి కనీసము 450 సం॥ల పాతవైయున్నవన్న మాట. దీనిని బట్టి వందలకొలది సం॥లు ముందుగానే దేవుడు తన కుమారుని గూర్చి ప్రజలకు గురుతుల నిచ్చెను అని మనము గ్రహించవలెను. ఇప్పుడు పాతనిబంధనలోని ప్రవచనములను మనము కొన్నింటిని చదివి అవి యేసు క్రీస్తులో ఎట్లు నెరవేరెనో గ్రహించుదాం. పాతనిబంధనలో యున్న ప్రవచనము లన్నింటిని గమనించుటకు మనకు సమయము చాలదు గనుక కొన్నింటిని మాత్రమే గమనించుదాం.

## ప్రవచనముల నెరవేర్పు

ఆదికాండము 3:15లో జగద్రక్షకుని గూర్చిన మొట్టమొదటి ప్రవచనము మనకు కన్పడుచున్నది. ఆయన స్త్రీ సంతానమై యుండునని (అంటే పురుషుని మూలముగా కలిగిన వాడు కాదు అని ) యెహోవా దేవుడు చెప్పెను. అయితే గలతీ 4:4లో మనము చూచిన, "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీ యందు పుట్టెను" అని పరిశుద్ధాత్ముడు పౌలుద్వారా వ్రాయించెను. యేసుక్రీస్తు పురుషుని ఎరుగని కన్యగర్భమున జన్మించెను. అందువలన ఆయన స్త్రీ సంతానమాయెను.

క్రీస్తు బెత్లెహేములో జన్మించును అని మీకా 5:2లో ప్రవచింపబడెను. "రాజైన హేరోదు దినముల యందు యూదయ దేశపు బెత్లెహేములో యేసు పుట్టిన పిమ్మట ఇదిగో తూర్పుదేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చిరి" యని మత్తయి 2:1 లో దాని నెరవేర్పు ప్రవచింపబడిన రీతిగానే ఆయన కన్యయైన మరియకు జన్మించెను అని మత్తయి 1 అధ్యా, లూకా 1 అధ్యాయము చదువుట వలన మనము గ్రహించగలము.

యేసు బాలుడై యుండగా

ఐగుప్తునకు కొనిపోబడును అని హోషేయ 11:1లో ప్రవచింపబడెను. హేరోదు రాజు పసిబాలుడైన యేసును సంహరింప జూచుచున్నాడని ప్రభువు దూత యోసేపుకు తెలియజేయగానే అతడు లేచి రాత్రివేళ శిశువును, తల్లిని తోడుకొని ఐగుప్తునకు వెళ్లి హేరోదు మరణము వరకు అక్కడ ఉండెను అని మత్తయి 2:14లో మనము చదువగలము.

యేసు యొర్దాను నది అద్దరిని, గలిలయ ప్రదేశమున సువార్త ప్రకటించునని యెషయా 9:1లో ప్రవచింపబడెను. యోహాను చెరపట్టబడెనని యేసు విని గలిలయకు తిరిగివెళ్లెను అని మత్తయి 4:12 దాని నెరవేర్పును మనకు సూచించుచున్నది. ఆయన తన ప్రజల వలన తృణీకరింపబడుననియు, విసర్జింపబడుననియు యెషయా 53:3లో ప్రవచింపబడితే, "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు" అని యోహాను వ్రాసెను (యోహాను 1:11).

యేసును తన స్నేహితుడొకడు అప్పగించును అని కీర్త 41:9లో ప్రవచింపబడెను. ఆయన అపొస్తలులగు 12 మందిలో యొకడగు ఇస్కరియోతు యూదా ఆయనను అప్పగించుట ద్వారా అది నెరవేరెను (మార్కు 14:10). యేసును అతడు ముప్పది వెండినాణెములకు అప్పగించునని, ఆ ధనమును, అతడు తిరిగి ఇయ్యగా దానితో కుమ్మరివాని పొలముకొనబడునని జెకర్యా 11:12,13లో ప్రవచింపబడెను. మత్తయి 27వ అధ్యాయమును మనము చదివిన యెడల యేసును అప్పగించినందుకు ఇస్కరియోతు యూదా పశ్చాత్తాపపడి ఆ ముప్పది వెండినాణెములను యూదుల అధికారులకు తిరిగి ఇయ్యగా వారు ఆలోచనచేసి పరదేశులను పాతిపెట్టుటకు కుమ్మరివాని పొలమును ఆ డబ్బుతో కొనిరి అని మనము గ్రహించగలము.

యేసుపై అబద్ధసాక్షులు లేతురు అని కీర్తన 27:12లో ప్రవచింపబడెను. మత్తయి 26:57-60 వరకు చదివితే యేసును చంపవలెనని ప్రధాన యాజకులును, మహాసభ వారందరును ఆయనకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదుకగా చివరకు ఇద్దరు మనుష్యులు వచ్చి ఆయన మీద అబద్ధ సాక్ష్యము పల్కినట్లు కనుగొనగలము. అతిక్రమము చేయువారిలో ఆయన ఎంచబడునని యెషయా 53:12 లో ప్రవచింపబడెను. అది నెరవేరునట్లు ఆయన కుడివైపున ఒకడును ఎడమ వైపున ఒకడును ఇద్దరు బందిపోటు

దొంగలు ఆయనతో కూడ సిలువ వేయబడిరి యని మత్తయి, మార్కు, లూకా అనువారు వ్రాసిన సువార్తలలో మనము కనుగొనగలము (మత్తయి 27: 38; మార్కు 15:27,28; లూకా 23:33).

దేవుని యొక్క ఏకైక కుమారుడు పొడువబడును అని జెకర్యా12:10లో ప్రవచింపబడెను. యేసు సిలువ మీద యుండగా "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కనపొడిచెను, వెంటనే రక్తమును నీళ్ళును కారెను" అని యోహాను 19:34లో మనము చూడగలము. యేసు యొక్క యెముకలన్నియు కాపాడ బడును, వాటిలో ఒక్కటియైనను విరిగిపోదు అని నిర్గమ 12:46లోను, కీర్తన 34:20 లోను ప్రవచింపబడెను. యోహాను 19:31-38 వరకు మనము చూచిన సైనికులు వచ్చి యేసుతో కూడా సిలువ వేయబడిన ఇద్దరి కాళ్లను విరుగగొట్టిరి గాని వారు యేసునొద్దకు వచ్చి అంతకుముందే ఆయన మృతిపొంది యుండుట చూచి వారు ఆయన కాళ్ళు విరుగగొట్టలేదు అని గమనించగలము.

యేసు చనిపోయినను తిరిగిలేచును అని కీర్తన 16:10లో ప్రవచింపబడిన రీతిగానే ఆయన సమాధి నుండి సజీవుడై లేచినట్లు మత్తయి, మార్కు, లూకా, యోహానులు వ్రాసిరి. తోమా అను శిష్యుడు ఆయన గాయములలో చేతులుంచి, విశ్వసించి నా ప్రభువా, నాదేవా అని ఆయనను మ్రొక్కెను (మత్తయి 28:9; లూకా 24:36-48, యోహాను 20:26-29).

యేసు సమాధి నుండి తిరిగి లేచిన తరువాత పరలోకమునకు ఆరోహణుడై పోవును అని కీర్తన 68:18 లో దావీదు ప్రవచించెను. యేసు తన శిష్యులను "బేతనియవరకు తీసికొనిపోయి చేతులెత్తి వారిని ఆశీర్వదించుచుండగా ఆయన వారిలో నుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణుడాయెను" అని లూకా వ్రాసెను (లూకా 24:50,51; అపొ.కా. 1:9).

పాతనిబంధనలో యేసును గూర్చి వందలకొలది సం॥లకు ముందే చెప్పబడిన అనేక ప్రవచనములలో కొన్నింటిని మాత్రమే మీకు చూపిస్తూ వాటి నెరవేర్పును కూడ క్రొత్తనిబంధనలో నుండి మీకు తెలియజేసాను. ఈ ప్రవచనములను ప్రవచించిన వాడు, వాటిని అనేక సం॥ల తరువాత నెరవేర్చిన వాడు దేవుడే. అందువలన యేసుక్రీస్తు దేవునిచేత పంపబడిన రక్షకుడని, ఆయనే దేవుని కుమారుడని మనము తప్పక విశ్వసింపవచ్చును గదా.

నెరవేర్చబడిన ఈ ప్రవచనము

లన్నియు యేసు దేవుని కుమారుడని నిరూపించుట మాత్రమేగాక, పాతనిబంధనను వ్రాసిన లేఖకులు వారి స్వజ్ఞానమును బట్టి దానిని వ్రాయలేదు గాని దైవనడిపింపుచే వ్రాసిరి యని అవి దృఢముగా మనకు నిరూపించుచున్నవి. 2 పేతురు 1:20-21 ఇట్లు చెప్పుచున్నది: "ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములలో ఏ ప్రవచనము పుట్టదని ఇట్లనుచున్నాడు:"మీ హృదయమును కలవరపడ నియ్యకుడి, దేవుని దేవుని యందు విశ్వాసముంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి" , "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14 :1,6). మీరు క్రీస్తు పాదముల యొద్ద కూర్చొని, ఆయన ఆజ్ఞలను విని వాటిని శిరసా వహించిన యెడల ఆయనే మీకు మోక్షమును దయ చేయగలడు !

## సంఘచరిత్ర

అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో క్రీస్తు సంఘస్థాపనకొరకు లేదా ఆయన రాజ్యారంభము కొరకు సమస్తము సంసిద్ధమై యున్నట్లు మనము చూడగలము. అపొస్తలు లందరు యెరూషలేములో యుండిరి. పరిశుద్ధాత్మ వారిపై దిగెను. పెంతెకొస్తు నాచరించుటకు అనేక జనములలోనుండి వచ్చినవారక్కడ యుండిరి. పేతురును, మిగిలిన అపొస్తలులును లేచి యోవేలు ప్రవక్తద్వారా చెప్పబడిన సంగతి యిదే యని ప్రకటించిరి. క్రీస్తు చనిపోయెను గనుక అంత్యదినము లారంభమాయెను; మారు మనస్సు పాపక్షమాపణలు ప్రకటించబడెను. సువార్త ప్రకటింపబడగా ఇంచుమించు మూడు వేలమంది విని బాప్తిస్మము పొందిరి. వారిని ప్రభువు తన సంఘముతో చేర్చెను. అప్పుడు సువార్త యెరూషలేమునుండి యూదయ సమరయ దేశముల యందంతటను, భూదిగంతముల వరకును, ఆకాశము క్రిందయున్న సర్వ జనాంగములు, సర్వసృష్టి వినునంతవరకును ప్రకటింపబడెను (అపొ.కా. 1:8; మత్తయి 28:19,20; మార్కు 16:15,16; కొలస్స 1:23).

అపొస్తలుల కాలములో సంఘము బహుగా అభివృద్ధి చెందెను. అది త్వరగా వ్యాప్తి చెందెను. పౌలు మార్పు చెందిన తరువాత, యూదులకు మాత్రమేగాక అన్యజనులకును సువార్త బోధించుచు అతడు మూడు ముఖ్య ప్రయాణములు (Missionary Journeys ) చేసెను. అందువలన ఆసియాలోను, ఐరోపాలోను అనేకులు

మార్పుచెందిరి. మరియు క్రీస్తు సంఘము లనేకములు స్థాపించబడెను. అయితే గొప్పహింసలు కలిగినందున ఇది తేలికగా జరుగలేదు. మొదట యెరూషలేమునందున్న సంఘమునకు గొప్ప హింస కలిగెను. గనుక శిష్యులు అనేక ప్రాంతములలోనికి చెదరిపోయిరి. చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి (అపో.కా. 8:1-4). కాలము గడచిన కొలది, రోమీయులు వారి ప్రతి సమస్యలకు క్రైస్తవులను నిందించిరి. సరిగదా రోమా పట్టణములోను, వారి వారి సామ్రాజ్యమందంతటను యున్న క్రీడాస్థలములలో క్రైస్తవులను ఘోరముగ హింసించుచు ఆనందించిరి చివరకు పౌలుకూడ పట్టుబడి తీర్పుకొరకు రోమాకు కొనిపోబడెను. యోహాను తప్ప అపొస్తలులందరు క్రీస్తు నామముకొరకు హతసాక్షులైరి యని చరిత్ర చెప్పుచున్నది. అంతేకాదు వందలకొలది, వేలకొలది బహుశ లక్షలకొలది క్రైస్తవులుకూడ తమ ప్రాణములను కోల్పోయిరి.

హింసలు కలుగుచున్నను సంఘము అభివృద్ధి చెంది వ్యాపించెను. సంఘమునకు కలిగిన గొప్ప కీడు హింసలవలన కలుగలేదుగాని, సంఘములోపలనుండియే కలిగెను, విశ్వాసభ్రష్టత్వము జరుగునని అపొస్తలుడైన పౌలు ముందుగానే హెచ్చరించెను. అనగా క్రీస్తు సంఘసభ్యు లనేకులు అసత్య మార్గములోనికి తొలగిపోవు దినము వచ్చుచున్నదని అతడు హెచ్చరించెను. అతని మాటలు యిప్పుడు గమనించుదము: "సహోదరులారా, ప్రభువు దిన మిప్పుడే వచ్చియున్నట్టుగా ఆత్మవల్లనైనను, మాటవల్లనైనను, మాయొద్దనుండి వచ్చినదని చెప్పిన పత్రికవల్లనైనను, ఎవడైనను చెప్పినయెడల మీరు త్వరపడి చంచల మనస్కులు కాకుండవలెననియు, బెదరకుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడను బట్టియు, మనము ఆయనయొద్ద కూడుకొనుటనుబట్టియు, మిమ్మును వేడుకొనుచున్నాము. మొదట భ్రష్టత్వము సంభవించి నాశనపాత్రుడగు పాపపురుషుడు బయలుపడితేనేగాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు తన్ను తానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి. నేనింకను

మీయొద్ద నున్నప్పుడు ఈ సంగతులను మీతో చెప్పినది మీకు జ్ఞాపకములేదా? కాగా వాడు తన సొంత కాలమందు బయలుపరచబడవలెనని వానిని అడ్డగించునది ఏదో అది మీరెరుగుదురు. ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచ్నది, గాని ఇదివరకు అడ్డగించుచున్నవాడు మధ్యనుండి తీసివేయబడువరకే అడ్డగించును. అప్పుడా ధర్మవిరోధి బయలుపరచబడును. ప్రభువైన యేసు తననోటి యూపిరిచేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశముచేత నాశనముచేయును. నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపకపోయిరి గనుక, వానిరాక అబద్ధ విషయమైన సమస్తబలముతోను, నానావిధములైన సూచకక్రియలతోను, మహత్కార్యముతోను, దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనపరచు బలమును అనుసరించియుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలషగల వారందరును శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2 థెస్స 2: 1-12). ఆ దుర్నీతి అప్పటికే క్రియచేయుట మొదలిడెనని పౌలు చెప్పునది గమనించుము. ఇంకా అతడిట్లనుచున్నాడు: "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణవలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. ఆ అబద్ధికులు వాతవేయబడిన మనస్సాక్షిగలవారై వివాహము నిషేధించుచు, సత్యవిషయమై అనుభవజ్ఞానముగల విశ్వాసులు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొనునిమిత్తము దేవుడు సృజించిన ఆహారవస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుదురు" (1 తిమోతి 4:1-3). ఎఫెసులో యున్న సంఘ పెద్దలతో మాట్లాడుచు, పౌలు ఇట్లనెను: "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి. నేను వెళ్ళిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొనిపోవలెనని వంకరమాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు. కావున నేను

మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్ళు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసికొని మెలకువగా ఉండుడి" (అపో. కా. 20:26-31).

పౌలు హెచ్చరించిన రీతిగనే, సంఘములో యున్న వారే కొందరు క్రీస్తు అనుచరులను అసత్యములోనికి ఈడ్చుకొనిపోవుట మొదలిడిరి. ఈ భ్రష్టత్వము, సంఘపాలన పద్ధతిపై జరిపిన తిరుగుబాటుద్వారా మొదలిడెనని చరిత్ర చెప్పుచున్నది. ప్రతి స్థానిక సంఘము అందున్న పెద్దలు, పరిచారకులతో బాటు స్వతంత్రము కలిగి యుండవలెననేది ప్రభువుచిత్తము. అయితే కొంతకాల మగుసరికి అనేక స్థానిక సంఘములు ఒకే ఒక్క పెద్దను (Elder or Bishop ) మిగిలిన వారందరిపై ఉన్నతముగ నియమించిరి. ఇట్లు హెచ్చింపబడిన యతనికి అనేక సంఘములపై అధికారము గలవానిగ చేసిరి. ఇది చివరకు సంఘమంతటిపై సార్వజనిక అధ్యక్షతకు (Universal Bishop) దారితీసినది. ఇదంతయు ఒకేరోజున జరుగలేదు గాని అనేక సంవత్సరముల కాలములో జరిగెను. అందువలన క్రీ॥శ॥606 నాటికి మొదటి సార్వజనిక అధ్యక్షుడు లేక పోపు (Pope ) అనునతడు విశ్వాస భ్రష్టత్వములో యున్న సంఘమునకు శిరస్సుగా నియమింపబడెను. తత్ఫలితమే ఈనాడు మన మెరిగిన రోమన్ కేథలిక్ సంఘము. అయితే క్రీస్తు సంఘము కేమిజరిగెను? విశ్వాసమందు నమ్మకముగా నిలిచియున్న వారు బహుశ వారి ఉనికిని ఎవరు గుర్తింపకయే కొనసాగిరి. ప్రభువైతే ఆయన రాజ్యము లేక సంఘము సదాకాలము నిలుచునని చెప్పెను. సంఘము చేయవలసినది కూడ అదే.

క్రైస్తవలోకమునందు అయితే కేథలిక్కు సంఘము ఏలుబడిచేసెను. నిజానికి దాని ప్రభావము లోకమునందంతయు వ్యాపించినట్లాయెను. అది వలుకుబడిలో యుండి నియంతృత్వమును కొనసాగించిన కొన్ని వందల సంవత్సరముల కాలమును "చీకటి యుగములు" (Dark Ages) అని చరిత్రలో పిలువబడునంతవరకు వచ్చెను. కేథలిక్కు సంఘస్వాములే (Priests) బైబిలును చదివి అర్ధమును గ్రహించుటకు అర్హులు అని చెప్పుచు సామాన్య ప్రజలు బైబిలును చదువకుండగ అది బహిష్కరించెను. గనుక లోకమందంతటా చీకటి యుగము ఆరంభమాయెను. కేథలిక్కు స్వాములే బైబిలును చదివి

బోధించుటకర్హత గలవారని అది చాటించెను. దీనినిబట్టి ప్రజలు ఏమి తెలిసికొనవలెనని ఈ స్వాములు కోరుదురో దానినే వారు బోధించిరి.

అట్టి ఈ కాలమందు కేథలిక్కు సంఘము చిలకరింపు, వాయిద్య సంగీతము అను అంశముపై రోమన్ కేథలిక్కులనియు, గ్రీకు కేథలిక్కులనియు రెండు శాఖలుగా విభజింపబడెను. కాలము గడచినకొలది రోమన్ కేథలిక్కు సంఘము అనేక సిద్ధాంతములను, బోధనలను కనుగొని బోధించెను. చివరిగా 16వ శతాబ్దము ఆరంభమగుసరికి కేథలిక్కు సంఘము బోధలోను, నీతిలోను బహు కలుషితమైపోవుటచే మార్టిన్ లూథరు అను నతడు, ఆ సంఘమందు స్వామిగా పనిచేయుచు దాని దిద్దుబాటు చేయవలెనని ప్రయత్నించెను. అందువలన అతడు బహిష్కరింపబడెను. అతడా సంఘమును వీడి తను సరియైనదని భావించిన దానిని బోధించుటకును, అనుసరించుటకును మొదలిడెను. తద్వారా సవరణోద్యమము **(Reformation)** లేదా ప్రొటెస్టాంట్ ఉద్యమము ఆరంభమాయెను. దీనినుండి నేటివరకు మనమెరిగిన మతశాఖలతత్వము **(Denominationalism)** ఉద్భవించెను. లూథరుఅనుసరించిన విధానమునుబట్టి ప్రపంచమందనేక చోట్ల బైబిలు నొద్దకు మరలుదము అనెడి ఉద్యమ మారంభమాయెను. అయినను అది సంపూర్ణ విజయమును సాధించలేకపోయెను.

17వ శతాబ్దములోను, 18వ శతాబ్దములోను యూరపులోను, అమెరికాలోను మతశాఖలను గూర్చియు, విభజనలను గూర్చియు,విసిగిపోయిన కొంతమంది డినామినేషన్ ప్రజలుండిరి. క్రమేపి వారున్న అబద్ధ బోధలనుండి విడుదలపొంది సంపూర్తిగ బైబిలు ననుసరించుటకు మొదలిడిరి. లేఖనములు బోధించు సంఘమునొద్దకు మరలుటయే వారి ఉద్దేశముగాని ఒక క్రొత్త సంఘము స్థాపించుట వారి కోరికకాదు. దానిని వారు సాధించిరి. అప్పుడినుండియు పరిపూర్ణ క్రొత్తనిబంధన క్రైస్తవ్యమును గూర్చిన విజ్ఞాపన లోకమందంతటా ప్రకటింపబడుచున్నది. అందుచే లక్షలాది ప్రజలు మనుష్యులు కల్పించిన పద్ధతులను బోధలను విడనాడి, కేవలము క్రైస్తవులగుటకును, క్రీస్తు సంఘ సభ్యులగుటకును, బైబిలును మాత్రమే వారి మార్గదర్శిగా యెంచుకొనుటకును నిశ్చయించుకొనుచున్నారు. సత్యమును బోధించుటకు లోకమందంతటా వెళ్ళిన క్రైస్తవులు ఆఫ్రికా, ఇండియా, రష్యా,పోలెండు దేశములలో పవిత్రముగాయున్న క్రీస్తు సంఘములుండుట కనుగొనిరి. ఆ

సంఘము ఎల్లప్పుడు ఉండిన రీతిగనే ఇప్పుడును యున్నది. అది బైబిలు సంఘమే యని నిరూపించుటకొరకు దాని చరిత్రను సంఘారంభమువరకు తడువ నవుసరములేదు. సంఘముయొక్క మాదిరి బైబిలునందున్నది. మనము దాని నవలంబించునపుడు మనవే క్రీస్తు సంఘమవుదుము. విత్తనము దేవుని వాక్యము (లూకా 8:11). అపొస్తలుల కాలమందు అది దేనినుద్భవింపజేసెనో దానినే అనగా క్రైస్తవులను, క్రీస్తు సంఘ సభ్యులను అది ఈనాడు కూడ ఉద్భవింపజేయును. దేవుని రాజ్యము నిరతము నిలుచునని మన మెరుగుదుము. గనుక అది స్థాపింపబడిన నాటినుండియు నిలిచేయున్నది. అది సదా కాలము నిలుచుచునే యుండును. దానిని నాశనము చేయుటకు మానవునికిగాని అపవాదికిగాని శక్తి లేదు. ఇదియే ప్రభువు రాజ్యము, ఆయన సంఘము, ఆదినుండి అంతమువరకు విజయవంతమై చివరిగా ప్రభువులో సదా కాలముండు సంఘము యిదే, అది క్రీస్తు సంఘము!!

ప్రకటన గ్రంథ ప్రసంగమాలిక - 25

# విందు - విజయము

## పరిచయము:

ప్రకటన 12,13,14 అధ్యాయాల్లో దేవుని ప్రజల యొక్క ఐదుగురు శత్రువులు పరిచయం చేయబడ్డారు.

మొదటివాడు క్రూరమృగమైన సాతానుడు.

రెండవ శత్రువు సముద్రము పైనుండి లేచు క్రూరమృగమైన ప్రభుత్వములు. అవి క్రైస్తవులను హింసించునట్టివి.

మూడవశత్రువు భూమిపైనుండి లేచు క్రూరమృగమైన అబద్ధ ప్రవక్తలు, బోధలు, నకిలీ క్రైస్తవ్యము.

క్రూరమృగము యొక్క ముద్ర ధరించుకొన్నవారు నాల్గవశత్రువు. వారు క్రీస్తుకు గాక సాతానుకు దాసులు.

ఐదవదిగా, ఈ లోకాశలు, మోహాముతో దేవుని ప్రజలను మోసగించిన బబులోను,అది రోమా సామ్రాజ్యమని కూడా గమనించాము.

ప్రకటన 15, 16 అధ్యాయాల్లో క్రూరమృగము యొక్క ముద్ర ధరించుకొన్న వారిపై దేవుని ఉగ్రత

కుమ్మరింపబడెను. 17, 18 అధ్యాయాల్లో గొప్ప వేశ్యయైన బబులోను పతనం చిత్రీకరింపబడినది. 19వ అధ్యాయములో సముద్రముపైనుండి, భూమిపైనుండి లేచిన అబద్ధ ప్రవక్త, నకిలీ క్రైస్తవ్యము నాశనం చూస్తాము.

**హల్లెలూయ కోరస్ (19:1-10):**

బబులోను పతనకారణముగా ఇక్కడ దేవునికి స్తుతిగీతములు పాడబడినవి. 'హల్లెలూయ' అను పదము క్రొత్తనిబంధనలో ప్రకటన 19 లోనే కనబడును. ప్రభువుని స్తుతించుడి (హాల్లెలూయ ) అను మాట ఈ అధ్యాయములో 4 సార్లు కనబడును.

**మొదటి హల్లెలూయ: (1,2వ):**

గొప్ప స్వరము పరలోకమందు "ప్రభువును స్తుతించుడి" యని చెప్పగా యోహాను వినెను.

"రక్షణ మహిమ ప్రభావములు" రోమా ప్రభుత్వానికి కాదుగాని దేవునికే చెల్లును. ''ఆయన తీర్పులు సత్యములును, న్యాయములునై యున్నవి."

దేవుని తీర్పులు పక్షపాతములేనివి. క్రీస్తు యొక్క సర్వజ్ఞానమును బట్టి అవియుండును.

గొప్ప వేశ్యకు తీర్పు తీర్చబడెను. మొదటిగా రోమా దేశము ఈ లోకమును చెరిపెను. రెండవదిగా దేవుని దాసులను రోమా ప్రభుత్వము హత్యచేయించెను. ఆయనదాసుల రక్తమును బట్టి దానికి ప్రతి దండన చేయబడెను.

సౌలు క్రైస్తవులను హింసించుచున్నప్పుడు క్రీస్తును హింసించెను. (అపో. కా. 9:4).

-మనం క్రైస్తవులకు వ్యతిరేకముగా పాపంచేస్తే, అది క్రీస్తుకు వ్యతిరేకముగా పాపము చేసినట్లే. 1 కొరింథీ 8:12.

-రోమా ప్రభుత్వము క్రైస్తవులను చంపించినప్పుడు, క్రీస్తుకు వ్యతిరేకముగా పాపము చేయుచుండెను. (మత్తయి 25:45)

**,రెండో హల్లెలూయ: (3-5వ):**

రోమా యొక్క నాశనమును బట్టి గొప్పసంతోషము కలిగెను.

దాని యొక్క పొగ యుగయుగములు పైకి లేచుచున్నది. నిత్యశిక్షయొక్క వర్ణనయిది (ప్రకటన 14:10-11).

రోమా పట్టణము అగ్నితో నాశనము గావించబడెను (ప్రక 18:8-9;18:21)

ఆ ఇరువది నలుగురు పెద్దలును, నాలుగు జీవులును సాగిలపడి -ఆమేన్ ప్రభువుని స్తుతించుడి యని చెప్పిరి.

తరువాత పరలోక సింహాసనము నుండి వచ్చిన ఒక స్వరము-మన దేవునిదాసులారా, ఆయనకు భయపడు వారలారా, కొద్దివారేమి, గొప్పవారేమి మీరందరు ఆయనను స్తుతించుడి యని చెప్పెను.

సర్వకాల సర్వావస్థలయందున్న ప్రజలందరు ఆయనను స్తుతించాలని దేవుడు కోరుచున్నారు.

**మూడో హల్లెలూయా:(6-10వ)**

తరువాత గొప్ప జన సమూహపు శబ్దమును, విస్తార జలముల శబ్దమును, బలమైన ఉరుముల శబ్దమును పోలిన యొక స్వరము ఆయనను స్తుతించుడియని చెప్పెను.

–ఏలయనగా ''సర్వాధికారియు ప్రభువునగు మనదేవుడు ఏలుచున్నాడు". యేసుక్రీస్తు అందరికి ప్రభువు (అపో.కా. 10:36)

–యేసు క్రీస్తు దేవుడైయున్నారు (యోహాను 1:1-3,14). సర్వశక్తుడు అను మాట గ్రీకు క్రొత్తనిబంధనలో 10 సార్లు కనబడును. అందులో 9 సార్లు అది ప్రకటన గ్రంధములో కనబడును.

–అంటే అన్ని సంగతులు ఆయన ఆధీనములో యున్నవి. సమస్తాన్నీ ఆయనే కంట్రోల్ చేయుచున్నారు.

–"సర్వాధికారియు, మన ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు". ఆయన ఇప్పుడు పాలించుచున్నారు, యిది భవిష్యత్తులో రాబోవుచున్నదనే 'వెయ్యేండ్ల పాలన' సిద్ధాంతమును చిత్తుచేయుచున్నది.

–"ఎందుకనగా తన శత్రువులనందరినీ తన పాదము క్రింద ఉంచు వరకు ఆయన రాజ్యపాలన చేయుచుండవలెను" (1 కొరింథీ 15:25).

–దేవుడు ఆయా ప్రజలను రాజ్యములను ఎల్లవేళలా తన స్వాధీనములో ఉంచుకొనియున్నారు (దానియేలు 4:25).

–పరిశుద్ధులు సంతోషించి, ఉత్సహించి, ఆయనను మహిమ పరచెదమని చెప్పబడిరి. మత్తయి 5:12లో "సంతోషించి ఆనందించుడి. పరలోకమందు మీ ఫలము అధికమగును" అని యేసు చెప్పెను. ఎందుకు?

–ఏలయనగా "గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది"

–పాత క్రొత్తనిబంధనలలో దేవునికిని ఆయన ప్రజలకును యున్న సంబంధముతో వివాహము ముడిపడియుండెను (రోమా 7:4; 2 కొరింథీ 11:2; ఎఫెసీ 5:25-29; ప్రకటన 22:17).

–"ఆయన భార్య తన్ను తాను

సిద్ధపరచుకొనియున్నది గనుక మనము సంతోషపడి ఉత్సహించి ఆయనను మహిమ పరచెదము"

-"మరియు ఆమె ధరించుకొనుటకు ప్రకాశములును నిర్మలములునైన సన్నపు నారబట్టలు ఆమెకియ్యబడెను; అవి పరిశుద్ధుల నీతి క్రియలు" (8వ). పరలోక నివాసులదుస్తులు ఎల్లప్పుడు తెల్లనివే (ప్రకటన 3:5;7:9,14).

– క్రీస్తు యొక్క వధువు కళంకమైనను, ముడతయైనను లేకయుండవలను (ఎఫెసీ 5:27). తన ప్రజలు నిష్కళంకితులుగాను, పరిశుద్ధులుగాను యుండాలని దేవుడు కోరుచున్నారు. నీతిక్రియలు అను వస్త్రములను మనం ధరించుకోవాలి.

– "గొర్రెపిల్ల పెండ్లి విందుకు పిలువబడిన వారు ధన్యులు"(9వ).

-యూదులు వివాహమునకు ముందు 'ప్రదానము తరువాత వివాహము జరిగేవరకు యున్న కాలవ్యవధిలో వధువు, వరుడు ఒకరికొకరు సిద్ధపడేవారు. తదుపరి వరుడు వెళ్లి కట్నం యిచ్చి తన వధువును తీసికొని వచ్చి వివాహమాడేవాడు. అది గొప్ప సంతోష సమయం,ఒక్కోసారి 7 నుండి 14 రోజులవరకు వివాహ సంబంధమైన విందు, వినోదము వుండేది.

– ఈ సందర్భములో మత్తయి 22:11-13 ను చదువవచ్చును. ఆ గొప్పవిందుకు దేవుడిచ్చిన ఆహ్వానమును తిరస్కరించిన వారు నాశనము చేయబడుదురు.- అనేకులు పిలువ బడుదురు గాని ఏర్పరచబడిన వారు కొందరే.

– క్రైస్తవులు తమ్మును తాము ప్రభువుకు సమర్పించుకొన్నవారు, ప్రభువు తగినంత కట్నము చెల్లించేసారు. ఇప్పుడు మనం సిద్ధపడాలి. వరుడు క్రీస్తు, వధువు సంఘముకొరకు రాబోవుచున్నారు. అప్పుడు మనందరం వెళ్లి గొప్ప వివాహ విందులో పాల్గొందుము, అది నిత్య సంతోష సమయం.

-ఈ సంగతులను బయలు పరచిన వానిని యోహానును ఆరాధింపబూనుకొనగా, అతడు దూతల నారాధింపరాదని హెచ్చరింపబడెను. "దేవునికే నమస్కారము చేయుము" (10వ). (ప్రక 22:8-9; కొలస్స 2:18; 1 తిమోతి 2:5; మత్తయి 4:10 చదువుము).

– యేసు ప్రభువు శరీరము ధరించిన దేవుడు (యోహాను 1:14).

– దేవుని దూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని దేవుడు చెప్పెను (హెబ్రీ 1:6).

– "యేసును గూర్చిన సాక్ష్యము ప్రవచన సారమని"యోహానుకు చెప్పబడెను,

ఇంకోమాటలో ప్రవచనములలోని వర్తమానము యేసును గూర్చియేయుండెను. గనుక ప్రవచన సారము యేసును గూర్చి ఇయ్యబడిన సాక్ష్యమే.(లూకా 24:44 ; యోహాను 5:46).

**గొప్ప నాయకుడు (19:11-16) :**

- ప్రకటన గ్రంధములో క్రీస్తు సింహముగా, గొర్రెపిల్లగా, తీర్పరిగా, యుద్ధశాలిగా చిత్రీకరించబడెను.

- ఆయన తెల్లని గుర్రము మీద కూర్చుండెను. పూర్వకాలమందు సైన్యాధిపతులు తెల్లని గుర్రము మీద స్వారీచేసేవారు. తెలుపు పరిశుద్ధతకు, విజయానికి, సంతోషానికి చిహ్నము.

-దేవుని వాక్యము అను నామముఆయనకు పెట్టబడెను. ఆయన నమ్మకమైనవాడు, సత్యవంతుడు. (ప్రకటన1:5;3:7).

- "ఆయన నీతినిబట్టి విమర్శచేయుచు యుద్ధము జరిగించుచున్నాడు". యిది పాతనిబంధనలోని దృశ్యము (యెషయా 11:3-4;63:1-6).

- 'ఆయన నేత్రములు అగ్ని జ్వాలలవంటివి' (ప్రక 1:14). క్రీస్తు సర్వాంతర్యామి, ఆయన దృష్టికి ఏదీ మరుగులేదు.

- ఆయన శిరస్సు మీద అనేక కిరీటములుండెను. రాజులు కొన్నిసార్లు అనేక కిరీటములు ధరించేవారు. అనేక జనములపై వారికున్న అధికారమును అవి సూచించును. క్రీస్తులోకము నంతటినీ, జనాంగము లన్నిటినీ పాలించుచున్నారు.

- మరియు ఎవనికి తెలియని నామము ఆయనకు కలదు. దీన్నిగూర్చి మనం ఏమేమో ఊహించనవసరంలేదు.

- రక్తములో ముంచబడిన వస్త్రము ఆయన ధరించుకొనియుండెను. అది ఆయన శత్రువుల రక్తము,సిలువపై ఆయన చిందించిన రక్తము కూడాను.

- దేవుని వాక్యము అనునామము ఆయనకుండెను. (యోహాను1:1-3) నిజముగా ఆయన శరీరము ధరించిన దేవుడు.

- ఆయన నోట వాడిగల ఖడ్గముండెను (15వ). యిది దేవుని వాక్యమే (ప్రక 1:16; ఎఫెసీ 6:17;హెబ్రీ 4:12).

- దానితో ఆయనజనములను కొట్టును. ఇనుప దండముతో వారిని ఏలును (కీర్తన 2:6-9).

- ఆయనే సర్వాధికారియగు దేవుని తీక్షణమైన ఉగ్రత అను మద్యపు తొట్టి త్రొక్కును. (ప్రక 14:20;యెషయా 63:1-6).

- క్రీస్తు రాజులకు రాజు (1 తిమోతి1:18) (ప్రక 17:14;యోహాను

20:28.

**దేవుని మహాగొప్ప విందు : (19:17-18)**

- దేవుని దూత ఒకడు ఆయన శత్రువుల మాంసమును భక్షించుటకు ఆకాశ పక్షులను పిలుచుచున్నాడు. పూర్వకాలము ఆకాశపక్షులు కీడుకు సూచనయైయుండెను.

- అవి మానవుల యొక్కయు జంతువుల యొక్కయు మాంసమును భక్షించును. ఈ వాక్యభాగంలో బలిష్టులు బలిష్టులే కాదు. ధనవంతులు ధనవంతులే కాదు. మరణం యెదుటవారు బలహీనులు. ఆకాశ పక్షులు వారు ధనవంతులో, బలవంతులో మరెవరో ఎరుగవు. కొద్దివారేమి, గొప్పవారేమి. అందరి మాంసము వాటికి ఒక్కటే. ఈ దృశ్యాన్ని యెహెజ్కేలు 39:17-20 లో మీరు చూడవచ్చును.

**గొప్ప యుద్ధము : (19:19-21) :**

- తెల్లని గుర్రము మీద యున్నవానితోను, ఆయన సేనతోను యుద్ధము చేయుటకు ఆ క్రూరమృగమును, భూరాజులును కూడియుండిరి. ఆక్రూరమృగము రోమా సామ్రాజ్యము. భూరాజులు దానితో ఏకమైనవారు.

- వారు క్రీస్తుతో పోరాడారు. పోరాడుదురు.

-గాని అప్పుడా మృగమును, దానియెదుట సూచకక్రియలు చేసిన అబద్ధ ప్రవక్తయు, వారిననుసరించిన వారును పట్టబడిరి. వారు గంధకముతో మండు అగ్ని గుండములో పడద్రోయబడిరి. - కడమవారు (రోమాతో ఏకమై మిగిలినవారు) గుర్రము మీదయున్న వాని నోటనుండి వచ్చిన ఖడ్గము చేత (వాక్యముచేత) వధింపబడిరి.

- వారి నాశనము సంపూర్ణము దేవుని ప్రజల శత్రువులు ఓడిపోయారు. ఇంకనూ ఓడింపబడవలసిన శత్రువు ఒకడున్నాడు. వాడు సాతానుడు.

**ముగింపు :**

క్రూరమృగము యొక్క ముద్ర వేయించుకొనిన సాతాను అనుచరులు నాశనం చేయబడుట ప్రకటన 15-16 అధ్యాయాల్లో చూచాము. 17-18 అధ్యాయాలలో మహా వేశ్యయైన బబులోను (రోమా) నాశనం చేయబడింది. 19వ అధ్యాయములో క్రూరమృగము. అబద్ధ ప్రవక్త నాశనమయ్యారు. ప్రకటన 20:1-10లో సాతాను యొక్క పతనం చూద్దాం.

ఈ గొప్ప యుద్ధము దేవుని ప్రజల విజయంతో అంతమవును. ఆ విజయం గొప్ప ఆనందము కలుగజేయును. క్రైస్తవ జీవితం ఒక గొప్ప పోరాటము (2

తిమోతి 4:6-8; 6:10-18). ఈ పోరాటములో మనము విజయాన్ని సాధించగలము. (1 యోహాను 5:4). మనము కూడ పరలోకంలో నిత్యము సంతోషించగలము!!

## బైబిలు-సర్వే

## యేసు క్రీస్తు - ఆయన జననము - బాప్తిస్మము

క్రీస్తు వ్యక్తిగత సేవ 3సం॥ల 6నెలలు చేశారు. ఈ కాలంలో ఆయన పాలస్తీన అంతా తిరిగి క్రొత్తజీవిత విధానాన్ని బోధించారు. ఆఖరిగా ఆయన బంధించబడ్డారు. లోకమంతయు రక్షింపబడునట్లు ఆయన కల్వరిపై శిలువ వేయబడి తన ప్రాణాలను బలియిచ్చారు.

ముందుపాఠంలో యేసుక్రీస్తు కపెర్నహూమును కేంద్రముగా చేసుకొని చాలావరకు సేవ చేశారు. తరువాత గలిలయ ప్రాంతాన్ని విడచి పస్కా పండుగను ఆచరించుటకు యూదయలోని యెరూషలేము వెళ్ళారు. అక్కడ వున్నప్పుడు దేవాలయంవద్దనుండి వ్యాపారం చేయువాళ్ళ నందరినీ వెళ్ళగొట్టారు. అప్పుడే నికోదేముతో ప్రసిద్ధమైన క్రొత్తజన్మ గురించిన సంభాషణ జరిగింది. ఆ పండుగనుండి తిరిగి గలిలయకు సమరయ ప్రాంతంగుండా ప్రయాణమై వచ్చేటప్పుడు సుఖారు గ్రామంవద్ద గల యాకోబు బావివద్ద ఆయన ఒక స్త్రీని కలుసుకున్నారు. ఆమెతో చాలసేపు ఆత్మీయమైన సంగతులు మాట్లాడిన తరువాత- దేవుడు "ఆత్మ గనుక ఆయననుఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి" (యోహాను 4:24) అనే గంభీరమైన భావాన్ని ఆమెకు యేసు అందించారు.

## గలిలయలోని సేవ

యేసు గలిలయకు వచ్చిన తరువాత ఆయన అచ్చట 2 సం॥లు వుండి బోధించుచూ, రోగులను స్వస్థపరచుచూ తన కాలం గడిపారు. ఈ కాలంలో ఆయన ఒక్కసారి మాత్రం యెరూషలేము పస్కా పండుగ ఆచరించుటకు వచ్చినట్లుగా మనకు తెలుస్తుంది. ఒక్కసారి ఫోనీషియా దర్శించారు. ఆయన బాలుడుగా ఐగుప్తు విడచి పాలస్తీనాకు వచ్చిన తరువాత మరలా పాలస్తీనా విడచి వెళ్ళటం ఈ ఒక్కసారే. ఆయన గలిలయలో సేవ ప్రారంభించిన మొదటి దినాలలో తన బాల్యము గడిపిన స్వగ్రామమైన నజరేతుకు వచ్చినప్పుడు

ప్రజలు ఆయనను అంగీకరించకుండా తిరస్కరించారు. తన స్వగ్రామము విడచిన తరువాత యేసు గలిలయ కొండప్రాంతములో అనేకమందిని స్వస్థపరిచారు. కొంతమంది ఆయనతో స్వస్థపరచుకొనుటకు వచ్చేవారు. ఆయన గలిలయ ప్రాంతంలోని గ్రామాలు సంచరిస్తున్నప్పుడు గలిలయ సముద్రతీరంలో నున్న ఒంటరి ప్రాంతాలలో ఆయన సంచరిస్తున్నప్పుడు వేలాదిమంది ఆయనను వెంబడించారు. ఆసమయములోనే కపెర్నహూము దగ్గరగల ఒక కొండమీద తన గొప్ప ప్రసంగాన్ని చేశారు. దీనినే మనం "కొండమీద ప్రసంగం" అని పిలుస్తాము. ఇది మత్తయి సువార్తలో 5,6,7, అధ్యాయములలో వ్రాయబడింది. ఒకసారి ఆయన దైవవాక్యాన్ని వింటానికి వచ్చిన 5000 వేలమంది పురుషులకు 5 రొట్టెలు, 2 చేపలతో యేసు అద్భుతరీతిగా వారి కడుపు నింపారు. అలాగే యింకొకసారి 4000 వేలమందికి ఆహారం పెట్టారు. (సహజంగా) కొంతమంది ఆహారంకోసం ఆయనదగ్గరకు వచ్చేవారు. కానీ చాలా మందిమాత్రం ఆత్మీయమైన ఆహారంకోసం ఆయనను వెతుక్కుంటూ వచ్చేవారు. ఆయన వారి ఆత్మీయ దాహాన్ని తీర్చేవారు.. ఆయన గురించి ప్రజలు ఎంతపరితపించేవారంటే ఒకసారి ఆయన ప్రజలనుండి దూరంగా గలిలయసముద్రం ఆవలివైపునకు పోవాలి అని అవతలికి వెళ్ళేటప్పటికి ప్రజలు సరస్సు చుట్టూ తిరిగివచ్చి ఆయనను చుట్టుముట్టారు.

యేసు కేవలం గౌరవనీయులతో మాత్రమే తన జీవితాన్ని ముడిపెట్టుకోలేదు కానీ అంటరానివారుగాపరిగణించబడ్డవారితోనూ సంచరించాడు, వారితో భోజనం చేశాడు. అందుకు ఆయన చాలా విమర్శలకు గురయ్యాడు. ఐతే "నేను పాపులను పిలువవచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదని" చెప్పి వారిని ఖండించాడు (మత్తయి 9:13).

ఒకసారి ఆయన తనశిష్యులలో ముగ్గురిని ప్రత్యేకంగా ప్రార్ధించుటకై కొండపైకి తీసుకు వెళ్ళారు. అక్కడ ఆయన రూపాంతరం చెందారు. ఆయన ముఖం సూర్యునివలె ప్రకాశించింది. మోషే ఏలియాలు ఆయనతో మాట్లాడుచూ కనిపించారు. అప్పుడు పేతురు వారి ముగ్గురికీ మూడు పర్ణశాలలు కడతాము అని అన్నప్పుడు ఆకాశంనుండి ఒకస్వరం ఈలా పలికింది "ఇదిగో ఈయన నాప్రియకుమారుడు. ఈయనయందు నే నానందించుచున్నాను. ఈయన మాట వినుడి" (మత్తయి 17:5). కనుక

తండ్రియైన దేవుడే కుమారుడైన క్రీస్తుకు సర్వాధికారం యివ్వబడిందని తెలియపరిచారు. మోషేకు గాని ఆయనద్వారా వచ్చిన ధర్మశాస్త్రానికి గాని మన విధేయత చూపించనక్కరలేదు. కానీ క్రీస్తే సర్వాధికారి ఆయన అధికారము క్రింద మనంవుండాలి.

## యూదయ, పెరియా ప్రాంతములలోని సేవ

గలిలయప్రాంతములో రెండు సంవత్సరములు సేవ చేసిన తరువాత గుడారముల పండుగకు యేసు యెరూషలేము వచ్చారు. ఆయన రాకముందే యూదులలోని పరిసయ్యులు శాస్త్రులు ఆయనను వ్యతిరేకిస్తూనే వున్నారు. ఏదో ఒకవిధముగా వాదములద్వారా ఆయనను చిక్కులో యిరికించ చూస్తున్నారు. కానీ ప్రతిసారి వారు నెగ్గలేకపోతున్నారు. ఆఖరికి యిప్పుడు ఆయనను చంపచూస్తున్నారు. కానీ ప్రజలలో ఆయన పలుకుబడి చాలా ఎక్కువగా వున్నందున చంపటం కూడా సాధ్యపడలేదు. యేసు శాంతియుతంగా యెరూషలేము విడచి యొర్దానునది దాటి పెరియా ప్రాంతమునకు వెళ్ళారు. ఆయన బంధించబడకమునుపు కొన్ని నెలలు పెరియాలోను యూదయాలోను ఆఖరిగా సంచరించారు. ఆయన ఈ రెండు ప్రదేశాలు ఆఖరిసమయంలో తిరుగుచూ తన శిష్యులను విడిచిపెట్టేటప్పటికి వారి మనసులను సిద్ధంచేశాడు.

## అపోస్తలులు

యేసుకు అనేకులు శిష్యులున్నారు. ఆయనను ఎవరు వెంబడించారో వారందరూ ఆయన శిష్యులే. కానీ ఆయన వెళ్ళిపోయిన తరువాత ఆయన పనిని కొనసాగించేవారుండాలి కాబట్టి శిష్యులలో 12 మందిని అపొస్తలులుగా ఏర్పాటుచేశారు. అపోస్తలుడనగా 'ఆజ్ఞ'తో పంపబడినవాడని యర్ధము. యింకొక పాఠములో యేసు తన శిష్యుల కిచ్చిన యాజ్ఞనుగూర్చి చదువగలము 12 మందిలో రెండు జతలవారు మాత్రము అన్నదమ్ములు. వారు పేతురు, అంద్రెయ మరియు జెబెదయి కుమారులైన యాకోబు, యోహాను లనువారు. పేతురు యాకోబు యోహానను ముగ్గురు ప్రభువు యొక్క అంతరంగికులుగా ఎన్నుకొనబడ్డారు ఇంకొకడు మత్తయి.

ఇతను వన్నువననాలు చేసుకొనెడివాడు. ఇతనే మత్తయి సువార్త రాసినవాడు. ఇంకా ఫిలిప్పు, బర్తొలోమయి, తోమా. ఈ తోమా ప్రభువు లేచుటను గూర్చి మొదట నమ్మలేదు. అల్పయి కుమారుడైన యాకోబు. తద్దయి కుమారుడగు లెబ్బయి జెలోతీయుడగు సీమోను ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా. వీరిలో చాలామంది గలిలయ సముద్రములో చేపలు పట్టు జాలరులు. వీరు ప్రభువుతోవుండి ఆయన చేసిన బోధలను విని సూచకక్రియలను చూచి అపోస్తలులుగా తర్ఫీదు పొందారు. ఆయన వారిని బోధించుటకు పంపి రోగులను స్వస్థపరచు అధికారమును కూడా యిచ్చాడు.

## యేసు చేసిన సూచక క్రియలు

ప్రభువు చేసిన సూచక క్రియలను గూర్చి తెలుసుకొనకుండా ఆయన చేసిన అద్భుతముల వల్ల కూడా ప్రజలలో బహుప్రాచుర్యము పొందాడు.

సువార్తలలో ఆయన చేసిన 35 సూచకక్రియలు వ్రాయబడ్డాయి. చాలా మిగిలిన సూచక క్రియలు అక్కడక్కడ సూచించబడియున్నవి. వీటిలో 17 సూచకక్రియలు శరీర రోగములను బాగుచేయుటయే ఏసుతో బాగుచేయబడిన వారిలో చాలమంది గ్రుడ్డివారు చూపుపొందారు. పక్షవాయువుతో బాధపడుతున్న శతాధిపతి సేవకుడు బాగుపడ్డాడు. పుట్టుకతో చెవుడు మూగతో బాధపడుతున్న యౌవనస్తుడు బాగుపడి వినగల్గి మాట్లాడాడు. దెయ్యము పట్టినవారిని బాగుచేసాడు. ఆరుగురుని బాగుచేసాడు చనిపోయిన ముగ్గురను ఏసుక్రీస్తు సజీవులుగా తిరిగి లేపాడు. వీరిలో నాయీను విధవరాలి యొక్క కుమారుడు, సునగోగు అధిపతియైన యాయీరు కుమార్తె మరియు మార్తల సహోదరుడు ఏసుతో ఎక్కువగా ప్రేమింపబడిన లాజరు గలరు. ప్రభువు ప్రకృతిపై గల తన ఆధిపత్యమును నిరూపించుటకు 9 అద్భుతములు చేసెను. వీటిలో 5000 మందికి ఆహారము పెట్టుట, ఆయన గలిలయ సముద్రములో వచ్చిన

తుఫానును నిమ్మళపర్చుట గలవు క్రీస్తు ప్రజలను సంతోషపర్చుటకు సూచక క్రియలు చేయలేదు గాని ఆయన బోధలను విశ్వసించి ఆయన దైవత్వమును గ్రహించునట్లుగా చేసెను. ఒక వ్యక్తిని ఆయన బాగుచేసినపుడు ఆ వ్యక్తి అవసరమునుబట్టి తక్షణమే అతనిని బాగుచేసెను. అంతేగాని ప్రస్తుతము స్వస్థపర్చగలవారమని చెప్పుకొనువారికి పట్టినంతకాలము ఆయనకు పట్టలేదు. విశ్వాసము లేనివారిని కూడా ఆయన బాగుచేసెను. లాజరును లేపునప్పటికి తనను క్రీస్తు లేపగలడను విశ్వాసము లాజరునకు లేదు. ప్రస్తుత కాలమందు స్వస్థపర్చగలమని చెప్పువారు తమయొద్దకు వచ్చువారికి విశ్వాసము లేనియెడల బాగుపడరని చెప్పుదురు. ప్రభువు చేసిన సూచకక్రియలను బట్టి చూడగా ఇది సరియైన మాటగా మనకు కనబడుటలేదు.

**12 మంది అపొస్తలులకు ఏమి జరిగెను ?**

పెంతెకోస్తు దినమున సంఘము స్థాపించబడిన తరువాత అపొస్తలులకు ఏమి సంభవించినదను సంగతి క్రొత్త నిబంధనలో ఎక్కువగా వ్రాయబడలేదు. కాని వీరు చాలకాలము యెరూషలేములోనే కలసియున్నారు. అపొ.కా. 8:1లో వ్రాయబడిన ప్రకారము వచ్చిన శ్రమలనుబట్టి చాలమంది చెదరిపోయిరి. అపొ.కా.లో పేతురు చేసిన కార్యములు ఎక్కువగా వ్రాయబడినవి. ఆయనతోపాటు యోహాను కూడా ఉన్నాడు ప్రభువును అప్పగించిన యూదా తనకు తాను ఉరిపోసికొన్నాడు. ఆ 12 మందిలో యూదా మరణమును గురించియు అపొస్తలుల కార్యములలో వ్రాయబడినది. ఈ యాకోబు హేరోదు ద్వారా క్రీ॥శ॥ 44లో చంపబడెను. (అపొ.కా. 12:2). చరిత్ర కారుడైన యుసీబియస్ అపొస్తులుల గురించి వ్రాయుచు వారు ప్రపంచమంతయు సువార్త వ్యాపకము నిమిత్తము సంచరించి యోహాను తప్ప మిగిలినవారు హతసాక్షులైరని వ్రాసెను. యోహాను మాత్రము ఎఫెసు సంఘములో ఉండి వృద్ధుడైన తరువాత పత్మాసు ద్వీపమునందు బంధింపబడెను. అచట అతను మొదటి శతాబ్దపు అంతమున సహజ మరణమును పొందెను.

# సంక్షిప్త వార్తలు

2008 జూలై 10వతేదీ శుక్రవారం అమెరికాలోని ఓక్లహోమ క్రిస్టియన్ యూనివర్సిటీ నుండి 8మంది బృందము రిక్కీగూటం గారితో కలిసి పనిచేయుటకు కాకినాడ చేరుకొనిరి.

జూలై 12వ తేదీనాడు సూరంపాలెంలో జరిగిన కూటములో పైవారందరు పాల్గొనిరి. అక్కడ హాజరైన వారందరికీ క్రొత్తనిబంధన గ్రంథములు, కొందరికి చీరలు పంచిపెట్టుట జరిగినది. రిక్కీగారు, తదితరులు వాక్యపరిచర్య చేసిరి.

జూలై 14 వ తేదీ సోమవారం రాజానగరం దగ్గరలోయున్న గాదరాడలో  పై అమెరికా బృందము రిక్కీగారితో సహా సువార్త పనిలో సహాయపడిరి. తదుపరి వారు రాజమండ్రి చేరుకొనిరి.

జూలై 15 వ తేదీ మంగళవారం పోతుకూరులో జరిగిన కూటములో అమెరికా బృందము పాల్గొనిరి. స్థానిక క్రైస్తవులతో అమెరికా సోదర సోదరీలు మంచి సహవాసము ననుభవించిరి. పోతుకూరులో సోదరులు వై.ప్రభాకర్ గారు వాక్య పరిచర్య చేయుచున్నారు.

జూలై 18 వ తేదీ శుక్రవారం రాజవొమ్మంగి ప్రాంతమును పై సోదర సోదరీలు దర్శించి రిక్కీగారితో సహా అక్కడనున్న సంఘములను బలపరచిరి. రాజవొమ్మంగి ప్రాంతములో సోదరులు సి. హెచ్.జోసఫ్‌గారు, అనేక గ్రామములలో సత్యవాక్యమును చాటుచున్నారు. కూటము జరిగిన నాడు 9మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

జూలై 21న రాయవరంలోను,22న కరుగోరుమిల్లిలోను సువార్త కూటములు జరిగెను. విదేశీ సోదర సోదరీలు ఆయా ప్రాంతములలో యున్న క్రీస్తు సంఘములను దర్శిస్తు గొప్ప అనుభూతిని పొందిరి. కరుగోరుమిల్లిలో సోదరులు యన్.మోజెస్ గారు వాక్య పరిచర్య చేయుచున్నారు. ఆ రోజు నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

జూలై 22వ తేదీ మంగళవారం సామ్యూల్ రోనీ గూటంగారు స్వల్పవిరామము కొరకు అమెరికా దేశమునుండి స్వగృహమునకు చేరుకొనిరి.

జూలై 25న అమెరికాలో ఓక్లహోమా రాష్ట్రమునుండి మరి ఏడుగురు రిక్కీగారితో కలసి పనిచేయుటకు కాకినాడ చేరుకొనిరి. వీరును, ఇంతకు ముందే వచ్చియున్న ఎనమండుగురును అనగా మొత్తం 15 మంది రిక్కీగూటం గారితో సహా పలుగ్రామములు సంఘములు దర్శించిరి.

పై 15 మంది బృందము జూలై 28 సోమవారం కొందుకుదురు, శానపల్లి లంకలలో జరిగిన కూటములలో పాల్గొనిరి. ఆయా గ్రామములలో

సోదరులు డి. ఇశ్రాయేలు రాజుగారు శ్రమించి పనిచేయుచున్నారు.

జూలై 29 మంగళవారం గోవిందపురం, రాజపూడి,గ్రామములను పై బృందము దర్శించిరి. ఆయా కూటములలో వాక్య పరిచర్య చేసిరి. గోవిందపురం,రాజపూడి,బలభద్రపురం గ్రామములలో సోదరులు బంగారు జోసఫ్‌గారు సువార్త చాటుచున్నారు.

జూలై 30వ తేదీ బుధవారం గున్నేపల్లిలో జరిగిన కూటములో పై సోదర సోదరీలు పాల్గొనిరి. అక్కడ అనేకమంది హాజరై దేవుని వాక్యమును ఆసక్తితో వినిరి. రిక్కీగూటంగారు శ్రమించి పలు గ్రామములలో సువార్త చాటుచున్నారు,సంఘములను బోధకులను బలపరచుచున్నారు. పై అమెరికా బృందముతో కలిసి వెళ్ళిన ప్రతి గ్రామములోను క్రొత్తనిబంధన గ్రంధములను ఉచితముగా పంచిపెట్టిరి.

జూలై 31వ తేదీ శుక్రవారం కాకినాడ సమీపములో యున్న మాధవపట్నంలో ఉచితనేత్ర వైద్య శిబిరమును రిక్కీగారు నిర్వహించిరి. 99 మందికి నేత్రవైద్యం ఉచితంగా అందజేయబడెను. కంటి ఆపరేషన్ అవుసరమైన వారికి పిఠాపురం ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించబడెను.

సత్యవాణి - క్రీస్తుసంఘముద్వారా జరుగుతున్న అనేక పరిచర్యల కొరకు ప్రార్ధించ మనవి.

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2006-2008**

**To**

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by [illegible] Printed by [illegible] at Satya Vani Publication, [illegible] Kakinada - [illegible]